చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరిపించాలి

చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ వినతి

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్రంలో చేనేత సహకార సంఘాల పాలక మండలిలకు గత ఐదేళ్ల నుంచి ఎన్నికలు నిర్వహించటం లేదని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మంగళగిరి లోని చేనేత జౌళి శాఖ కమిషనర్ కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించారు. అనంతరం చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు పాలకమండలి నామినేటెడ్ బోర్డులు గాని ప్రత్యేక అధికారి లేకపోవుటతో సంఘాలలో రోజు వారి కార్యక్రమాలు కుంటుపడి చేనేత కార్మికులు పనులు లేక పస్తులతో గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఉద్యమాలు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిర్బంధిస్తామని అన్నారు. దేశంలోనే వ్యవసాయం తర్వాత అతిపెద్ద రంగమైన చేనేత రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయన్నారు. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఒక సంవత్సరం పాటు పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడిగించారు. 2019 ఫిబ్రవరి 11న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారి పార్టీ నాయకులతో ఆరు నెలల పాటు నామినేటెడ్ బోర్డులు ఏర్పాటు చేశారని, అదే సంవత్సరం అధికారం లోకి వచ్చిన వైసీపీ 2019 జులై 7న పార్టీ నాయకులతో ఐదుగురు సభ్యులతో నామినేట్ బోర్డులు వేశారన్నారు. అప్పటినుంచి నాలుగేళ్లలో 8 సార్లు నామినేటెడ్ బోర్డులను పొడిగించుకుంటూ వచ్చారని, ఈ ఏడాది జులై 6న నామినేటెడ్ బోర్డుల పదవీకాలం పూర్తి కావడంతో 7వ తేదీ నుంచి చేనేతకార సంఘాలకు అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు ఎవరూ లేకపోవడంతో బ్యాంకుల నుంచి డబ్బు డ్రా చేసేందుకు నాథుడెవ్వరు లేకపోవడంతో రోజువారీ కార్యక్రమాలు కుంటుపడి కార్మికులకు పనిచూపలేని పరిస్థితి నెలకొందన్నారు. చేనేత సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు జరిపి చేనేత కార్మికులకు పని చూపించాలని లేదా సంఘాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం చేనేత జౌళి శాఖ కమిషనర్ ఎంఎం నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్య కార్య చరణ కమిటీ నాయకులు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వర రావు, రామనాథం పూర్ణచంద్రరావు, పిల్లలమర్రి బాల కృష్ణ, మురుగుడు సత్యనారాయణ, గొట్టుముక్కల బాలా జీ, బట్టు రామారావు, కూరపాటి మోహన్‌రావు, తాడిపత్రి సత్య నారాయణ, తిరువీధుల రామసుబ్బారావు, రామ కృష్ణ, కొతవరపు వెంకటేశ్వరరావు, బత్తూరి మోహన రావు, బత్తుల గిరి, గజవల్లి వెంకటకృష్ణ, దొడ్డి ఈశ్వర రావు, భీమిశెట్టి బాల, దీపాల సత్యనారాయణ పాల్గొన్నారు.

నిరాహార దీక్షకు ఎస్సీ, ఎస్టీలు

విశాలాంధ్ర-తాడికొండ : రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న నారా చంద్ర బాబు నాయుడును విడుదల చేయాలని కోరుతూ స్థానిక అడ్డరోడ్డు సెంటర్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న నిరాహార దీక్షకు గురువారం ఎస్సీ, ఎస్టీలు హాజరయ్యారు. జగన్ ప్రభుత్వంలో తమకు జరుగుతున్న అన్యాయాల గురించి వివరించారు. అధిక సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. శుక్రవారం మహిళలతో నిరాహార దీక్ష కొనసాగనుంది. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సై పోస్టుల పరీక్షకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర-గుంటూరు : అక్టోబర్ 14, 15 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఎస్సై సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ తుది రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ప్రముఖ సేవా సంస్థ 'రామ్ కి ఫౌండేషన్' ఈ నెల 27వ తేదీ నుంచి ఉచిత శిక్షణ అందించబోతున్నట్లు అధ్యక్షులు ఎంవీ రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ కాకినాడ, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ హైదరాబాద్ వారి సంయుక్త సహకారంతో పకడ్బందీ ప్రణాళికతో కూడిన శిక్షణ ప్రతిరోజు, ప్రతివారం పరీక్షలు నిర్వహిస్తూ ప్రతిఒక్కరూ ఉద్యోగ అర్హత సాధించేలా అవసరమైన సబ్జెక్టులపై అనుభవజ్ఞులైన అభ్యర్థులతో వివరణాత్మక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజనం అందిస్తున్నామని, అభ్యర్థులు గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెదపరిమి లోని రామ్ కి ఫౌండేషన్ నైపుణ్య శిక్షణ కేంద్రంలో రిపోర్టు చేయాలన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్ 9000 లేదా http://www.ramkyfoundation.orgకు సంప్రదించాలన్నారు.

ఎమ్మెల్యే ఆర్కేకు జబర్దస్త్ టీమ్ కృతజ్ఞతలు

విశాలాంధ్ర-మంగళగిరి : తమ సహచర నటుడు పంచ్ ప్రసాద్‌కు ఇటీవల నియోజకవర్గ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సహాయం అందజేయడంపై జబర్దస్త్ టీమ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. యర్రబాలెంలో బుధవారం జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఆర్కేను అదే కార్యక్రమానికి సంబంధించి ఈవెంట్ నిమిత్తం విచ్చేసిన జబర్దస్త్ టీమ్ సభ్యులు శాంతి స్వరూప్, నూకరాజు, భాస్కర్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్కే పంచ్ ప్రసాద్ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు జిల్లా జట్టు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగే ఏపీ స్టేట్ లెవెల్ సీనియర్ ఇంటర్ డిస్టిక్ ఫుట్బాల్ ఛాంపియన్షిప్‌లో పాల్గొనడానికి గుంటూరు జిల్లా సీనియర్ మెన్ ఫుట్బాల్ టీం గురువారం వెళ్తుందని ఆంధ్రప్రదేశ్ ఫుట్బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, గుంటూరు జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతి కుమార్, కార్యదర్శి దుర్గా మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ ఈ నెల 19న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన నల్లమల్ల జోనల్ స్థాయి (గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం) ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ మెన్ ఫుట్బాల్ టోర్నమెంట్లో గుంటూరు జిల్లా జట్టు పాల్గొని మొదటి స్థానం సంపాదించి ఏపీ స్టేట్ లెవెల్ పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించిందని తెలిపారు. జిల్లా జట్టుకు చీఫ్ కోచ్, మేనేజర్‌గా విజ్ఞాన్ యూనివర్సిటీ ఫుట్బాల్ కోచ్ డి.వెంకటేశ్వర్లు, ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ ఫుట్బాల్ కోచ్ శ్రీనాథ్ వ్యవహరిస్తానని తెలిపారు.

కీటకజనిత వ్యాధులపై ఎగ్జిబిషన్ స్టాల్స్

విశాలాంధ్ర, తెనాలి : జెఎంజె కళాశాల ఆవరణలో గురువారం తెనాలి మున్సిపల్, మలేరియాశాఖ సంయుక్తంగా దోమల వలన వ్యాపించే వ్యాధులు, తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి విద్యార్థులకు అవగాహన ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డా॥ కారుమూరి హెలెన్ నిర్మల మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా చినరావూరు, సత్యనారాయణ పార్కు, రజరపార్కు నుండు నడకదారులకు (వాకర్స్) అవగాహన కల్పించాలన్నారు. దోమకాటు వలన మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, ఫైలేరియా, మెదడువాపు తదితర వ్యాధులు వ్యాప్తిస్తాయని ప్రజలు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ దోమతెరలు వాడకం ద్వారా దోమకాటు నుండి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, నవీద్, భాషిద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనానికి నీలం సంజీవరెడ్డి పేరు పెట్టాలి

విశాలాంధ్ర-గుంటూరు : స్థానిక అమరావతి రోడ్డులోని గుంటూరు మెడికల్ కళాశాల మెన్స్ హాస్టల్ పాత భవనం స్థానంలో నిర్మిస్తున్న నూతన భవనానికి మాజీ రాష్ట్రపతి డాక్టర్ నీలం సంజీవరెడ్డి భవనంగా నామకరణం చేయాలని చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా, అవర్ స్టేట్ అవర్ లీడర్, వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపకులు జి.శాంతమూర్తి కోరారు. వెలగపూడిలోని సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింట్ అయిన రెప్కో హోం ఫైనాన్సు లిమిటెడ్, గుంటూరు వారి సూచనలమేరకు యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని తుంగల లక్ష్మి పావని గారికి ది.06.05.2022 తేదిన తోకల నాగ కోటేశ్వరి గారు దస్తావేజు నెం.1702/2022గా, తాడికొండ సబ్ రిజిస్టర్‌లో విక్రయ దస్తావేజు ద్వారా విక్రయ పరచినారని, అట్టి ఆస్తిని తుంగల లక్ష్మి పావని గారు ఉప్పుతోళ్ళ శంకర్ గారికి అమ్ముటకు నిర్ణయించి విక్రయ అగ్రిమెంటు ది.04.09.2023 న వ్రాసినారని ఆ విధముగా విక్రయ అగ్రిమెంటు వ్రాయించుకున్న ఆస్తిని ఉప్పుతోళ్ళ శంకర్ తన పేర విక్రయ దస్తావేజు వ్రాయించుకొనుటకు గాను నా క్లయింట్ అయిన కంపెనీ వద్ద లోను తీసుకొనుటకు నిర్ణయించుకొని తన పేర రిజిస్టరు అయ్యే డాక్యుమెంటుకు తనఖాగా ఉంచి నా క్లయింటు కంపెనీలో లోను తీసుకొనుటకు ప్రయత్నిస్తున్నారని అట్టి ఆస్తిపై ఎవరికైనాను ఏమైనా అభ్యంతరాలు గాని ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన వారం రోజులు లోపల ఈ దిగువ తెలిపిన చిరునామాకు లిఖిత పూర్వకముగా తెలియజేయగలరని యావన్మంది ప్రజానికానికి తెలియజేయడం అయినది. లేని యెడల ఎవ్వరికీ ఏ విధమైన అభ్యంతరాలు గాని, హక్కులు గాని లేవని భావించి దిగువ షెడ్యూల్ ఆస్తి పై నాక్లయింట్ ఋణము ఇవ్వగలదు. గడువు తరువాత వచ్చు అభ్యంతరాలను మా క్లయింట్ గాని ఋణదాతను కాని బద్ధపరచజాలవని యావన్మందికి తెలియచేయుటమైనది.

షెడ్యూల్ : గుంటూరు జిల్లా, తాడికొండ సబ్.డి, తాడికొండ రెవిన్యూ మండలం, పొన్నెకల్లు గ్రామ పంచాయితి, పొన్నెకల్లు గ్రామ, డి.నెం.270/1, లోని 121చ.గ స్థలము అందు నిర్మించిన ఇంటి డోర్.నెం.160, బ్లాక్.నెం.15, అసెస్మెంట్ నెం. 2740గా ఉన్న ఇంటికి **హద్దులు:తూర్పు:**తోకల నాగ కోటేశ్వరి గారి ఇంటి హద్దు,అ.33లు, **దక్షిణం:** జాన్ బాబు గారి ఇంటి ప్రహరీ గోడ హద్దు, అ.33లు, **పడమర:**పంచాయతీ బజార్, అ.33లు, **ఉత్తరం:**పంచాయితీ బజార్, అ.33లు.ఈ హద్దుల మధ్య య.121చ.గ. స్థలము మరియు అందులో నిర్మించిన ఇల్లు.

కాసు వెంకట రెడ్డి, అడ్వకేట్
డోర్.నెం.6-14-13, 14/3 అరండల్‌పేట,
గుంటూరు. సెల్: 9346983822

పోరాటాలకు పుట్టినిల్లు ఎస్టీయూ

విశాలాంధ్ర-గుంటూరు : పోరాటాలకు పుట్టినిల్లు ఎస్టీయూ అని, హక్కులు, బాధ్యతలను రెండు కళ్ళుగా భావించి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతూ, ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్న ఏకైక సంఘం ఎస్టీయూ అని ఎస్టీయూ గుంటూరు జిల్లా పూర్వ అధ్యక్షులు గేరా మోహనరావు అన్నారు. ఎస్టీయూ కాకుమాను మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలో శాఖ ప్రధాన కార్యదర్శి కాంద్రు సద్గుణరావు ఆధ్వర్యంలో ఎస్టీయూ సభ్యత నమోదు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గేరా మోహనరావు మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వమే ఏర్పడి 77 యేళ్లుగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం ఎస్టీయూ అన్నారు. జిల్లా కార్య దర్శి మద్దిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తా మని హామీ ఇచ్చిన సీఎం ఉద్యోగ, ఉపాధ్యాయ మనోభా వాలకు వ్యతిరేకంగా జీపీఎస్ విధానాన్ని క్యాబినెట్‌లో ఆమోదించడం విచారకరమన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని కొండ పాటూరు, కొమ్మూరు, కాకుమాను, అప్పాపురం, రేటూరు, పాండ్రపాడు, చినలింగాయ పాలెం, వల్లూరు గ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులతో ఎస్టీయూ సభ్యత్వాన్ని నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఆర్థిక కమిటీ మెంబర్ లంకపల్లి వీరాంజనేయులు, కాకుమాను మండల శాఖ ఆర్థిక కార్యదర్శి శివకోటేశ్వరరావు, నాయకులు సాతులూరి సుబ్బారావు, తుపాకుల వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి అండగా నిలవాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రి అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఎమర్జెన్సీ అంబులెన్స్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో వినాయక చవితి 3వ రోజు సందర్భంగా గురువారం అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆటో డ్రైవర్ల కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చారని, ముఖ్యంగా మహాప్రస్థానం వాహనాలు కూడా మృతదేహాలను వారి స్వగ్రామాలకు తరలించే విషయంలో ఎంతో తోడ్పాటు అందిస్తున్నారని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ఆసుపత్రిలోని మహా ప్రస్థానం వాహనాలన్ని ఆర్థికంగా నష్టపోయి చనిపోయిన కుటుంబాల కోసం అందుబాటులో ఉంచాలన్నారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డీఎస్ఎస్ శ్రీనివాస ప్రసాద్, సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మానస హాస్పిటల్‌లో 'మతి మరుపు'పై అవగాహన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : 'ప్రపంచ అల్జీమర్స్ వ్యాధి దినోత్సవం' సందర్భంగా స్థానిక కొత్తపేటలో ఉన్న మానస హాస్పిటల్ నందు ఆంధ్రప్రదేశ్ మానసిక వైద్యుల సంఘం అధ్యక్షులు, ప్రముఖ సీనియర్ సైకియాట్రిస్ట్ డాక్టర్ ఐవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా 65సంవత్సరాలు దాటిన వృద్ధులలో మతి మరుపు వ్యాధి లక్షణాలు ప్రాథమిక దశలో ఎలా గుర్తించాలి.. ఔషధాలతో పాటు వారి సంరక్షణ ప్రాముఖ్యతను... సంరక్షకుల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి సవివరంగా తెలియజేశారు. మతి మరుపు వ్యాధిని తొలి దశలో గుర్తించి వైద్యుల సహాలు పాటించడం వలన వారికి, వారి కుటుంబ సభ్యులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మానసిక వైద్యుల సంఘం కార్యదర్శి డాక్టర్ శరత్ చంద్ర, డాక్టర్ శ్రీరమ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: గుంటూరులో విధులు ముగించుకొని తిరిగి బైక్‌పై ఫిరంగిపురం వచ్చే క్రమంలో లారీ ఢీకొని హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వేములూరిపాడు గ్రామం కొండువీడు మేజర్ కాలువ సమీపంలో గుంటూరు-కర్నూల్ రహదారిపై గురువారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ఫిరంగిపురం గ్రామానికి చెందిన గుండిగ అనిల్‌కుమార్(41) సత్తెనపల్లి ముప్పాళ్ళ పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. గుంటూరులో యస్.ఐ సెక్షన్ డ్యూటీ అనంతరం తిరిగి ఫిరంగిపురం గ్రామం వైపు బైక్‌పై వస్తున్నాడు. వేములూరిపాడు గ్రామంలో కాలువ సమీపంలో ఈద్గా వద్దకు వచ్చేసరికి నర్సరావుపేట నుంచి గుంటూరు వైపుగా టెన్ టైర్ లారీ వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న హెడ్ కానిస్టేబుల్ అక్కడికక్కడే రోడ్‌పై మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ రైటర్ దేవదాసు చెప్పారు. మృతినికి భార్య గుండిగ సుజాత, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నేటి ధర్నా జయప్రదం చేయండి: మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు : మున్సిపల్ రంగంలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగ, కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 21న తలపెట్టిన ధర్నాలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శానిటరీ డివిజన్ పరిధిలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగర జనాభా పెరుగుదలకు అనుగుణంగా కార్మికులను పెంచాలని, జీపీఎఫ్ ఖాతాలు తెరవాలని డిమాండ్ చేశారు. సరెండర్ లీవులు, ఎన్కాష్మెంట్ రెండున్నర సంవత్సరాలు దాటిన పెండింగ్‌లోనే ఉంచి మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల శ్రమను అవమానిస్తున్నార న్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు కనీస వేతనాలను అందివ్వాలని, స్కూల్ స్వీపర్లకు ఫుల్ టైం జీతాల చెల్లింపు చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు, ఉద్యానవన కార్మికులకు, డ్రైవర్లు, డ్రైనేజీ కార్మికులకు రూ.6 వేలు రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, బదిలీ కార్మికులను అప్కాస్‌లో చేర్చాలని, కోవిడ్ నేపథ్యంలో విధుల్లోకి తీసుకున్న కార్మికులను కొన సాగించాలని తదితర డిమాండ్లపై దశల వారీ ఆందోళనలకు రాష్ట్ర సమితి పిలుపునిచ్చిందని చెప్పారు. 24న ఆయా కార్యాలయాల ఎదుట మానవహారాలు జరిపి, 26న రీజినల్ డైరెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ అసెంబ్లీ సమావేశాలలోనైనా మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో 27న రాష్ట్ర సమితి సమావేశం జరిపి దీర్ఘకాలిక పోరాటాల ఉధృతి పెంచుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సద్గుణరావు, మంగమ్మ, వెంకట సుబ్బమ్మ, శ్రీను, లీలా, ధనమ్మ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-మంగళగిరి : నియోజకవర్గంలో టీడీపీ నాయకులు చేపట్టిన రిలే నిరహారదీక్షలు ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి. మంగళగిరి పట్టణంలోని వైష్ణవి కళ్యాణ మండపం పక్కన టీడీపీ నాయకులు చేపట్టిన సామూహిక రిలే నిరహారదీక్షలు కొనసాగుతున్నాయి. 'బాబుతో-నేను' పేరుతో నియోజకవర్గ తెలుగు యువత ఆధ్వర్యంలో గురువారం దీక్షలు చేపట్టారు. నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావులు దీక్షలను ప్రారంభించారు. సాయంత్రం ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా విజనరీ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడు అని అన్నారు. గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా వేలాది మందికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడమే చంద్రబాబు చేసిన నేరమా అంటూ ప్రశ్నించారు. రిలే నిరహార దీక్షలో కూర్చున్న వారిలో పడవల మహేష్, కొప్పుల మధుబాబు, సింగిరిశెట్టి లీలా కృష్ణ, జంగాల వెంకటేష్, పినపాటి జీవన్ తదితరులు ఉన్నారు.

ఎవర్‌గ్రీన్ హీరో అక్కినేని

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తెలుగు సినిమా ఎవర్‌గ్రీన్ హీరో పద్మ విభూషణ్ అక్కినేని నాగేశ్వరరావు అని ప్రముఖ నాటక రచయిత డాక్టర్ బీవీ రామ్ కుమార్ అన్నారు. తొంభై మూడు సంవత్సరాల వయసు వరకూ నిరవధికంగా నటిస్తూ సినీ ప్రేమికులను..తెలుగు ప్రేక్షకులను అలరించి తెలుగు హృదయాలలో చిరంజీవిగా కొలువై ఉన్న నటుడు అని కొనియాడారు. అక్కినేని నాగేశ్వరరావు జయంతి సందర్భంగా స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో నాగేశ్వరరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కినేని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విశాలాంధ్ర మాజీ జనరల్ మేనేజర్, విశ్లేషకులు గూడవల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు తన జీవితాన్ని మదింపు చేసుకోవటం, ఎలాంటి సినిమా అయినా అందులో ఒదిగిపోయేలా నటించి పాత్రకి సజీవ దర్పణంలా నిలిచేవారు అక్కినేని అని అన్నారు. ఈ కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, అశోక్, పింగళి భాగ్యలక్ష్మీ, వివిరావ్, ఆర్.వెంకటేశ్వర్లు, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

బోధనేతర సిబ్బందిని అప్‌గ్రేడ్ పాఠశాలలకు బదిలీ చేయండి

జడ్పీ సీఈఓను కోరిన ఎస్టీయూ నాయకులు

విశాలాంధ్ర-గుంటూరు : డీగ్రేడెడ్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల పోస్టు లేనందున అక్కడ పనిచేస్తున్న బోధనేతర సిబ్బందిని అప్ గ్రేడ్ ఉన్నత పాఠశాలలకు బదిలీ(డిప్యూటేషన్ లేదా రెగ్యులర్ ప్రాతిపదికన) చేయాలని ఎస్టీయూ జిల్లా నాయకులు గురువారం జిల్లా పరిషత్ సీఈఓ జె.మోహన్ రావును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పీఎఫ్ నగదును ఆయా అకౌంట్‌లలో జమ చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఈఓ వెంటనే ఆయా భోదనేతర సిబ్బంది వివరాలను తెప్పించి తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని, పీఎఫ్ అకౌంట్లలో నగదు జమ చేస్తామని తెలిపినట్లు ఎస్టీయూ నాయకులు తెలియజేశారు. సీఈఓ సానుకూలంగా స్పందించడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు డి.పెదబాబు, ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి, ఉపాధ్యాయ వాణి జిల్లా కన్వీనర్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

అక్కినేని శతజయంతి వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు : నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు ఈ నెల 23వ తేదీ స్థానిక గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఘనంగా జరుపుతున్నట్లు అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తోటకూర ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలలో లబ్దప్రతిష్ఠులైన ప్రముఖులకు అవార్డుల ప్రధానం జరుగుతుందన్నారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ అక్కినేని కుటుంబ సభ్యులు, సినీ గేయ రచయిత భువనచంద్ర, మాటల రచయిత బుర్రా సాయి మాధవ్, వేద కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి తదితరులు పాల్గొంటారన్నారు. ప్రముఖ సాహిత్య పరిశోధకులు పారా అశోక్ కుమార్ రచించిన 'అక్కినేని 100'(శత వసంతాల అక్కినేనికి చిత్రాంజలి) పుస్తక ఆవిష్కరణతో పాటు పద్మశ్రీ అన్నవరపు రామస్వామి, డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య, ప్రముఖ నవలా రచయిత్రి లల్లా దేవి, మనసు ఫౌండేషన్ ఎంబీ రాయుడు, చిత్రకళాకారుడు రాపర్ల వినోద్ చౌదరి తదితర ప్రముఖులకు పురస్కార ప్రధానోత్సవం జరుగుతుందని చెప్పారు. అపర ఘంటసాల బాలకామేశ్వరరావు, శాంతి శ్రీ బృందంచే అక్కినేని పాటల సంగీత విభావరి, చందు(హైదరాబాద్) బృందం ప్రదర్శన కార్యక్రమాలు ఆహుతులను అలరింపచేయనున్నాయని తెలిపారు. నగర ప్రజలు, అక్కినేని అభిమానులు, సినీ, సాహిత్యాభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-పెదకాకాని : నవజీవన్ బాల భవన్ వారి ఆధ్వర్యంలో పెదకాకానిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహనా కార్యక్రమాన్ని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా గురు వారం ఏర్పాటు చేశారు. నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ మత్తు పధార్థాలతో బతుకు దుర్భరం చేసుకోవద్దన్నారు. విద్యార్థి దశలో విద్యార్థులు ఒక్కసారి ధూమపానం, మద్యం సేవించడం, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రతను కోల్పోయి మాన సికంగా కృంగిపోతారని అన్నారు. క్యాన్సర్, ఇతర ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన బాలలు, యువతను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకొనిరావ చ్చని చెప్పారు. వివరాలకు 9490492020 సంప్రదించవచ్చని తెలిపారు. పెదకాకాని సర్పంచ్ గోళ్ళ స్వరూపారాణి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రెటరీ మధులత దుర్గం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.భాస్కరరావు, నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం పాలన

విశాలాంధ్ర-ఫిరంగిపురం: సీఎం జగన్మోహన్‌రెడ్డి సుపరిపాలనలో ప్రతి ఊరిలో అర్హత కలిగిన ప్రజలంతా అనేక సంక్షేమ ఫలాలు పొందుతున్నారని, రాష్ట్ర మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత వైసీపీ అధినేత జగనన్నదేనన్నారు. గురువారం ఎంపిపి షేక్ షహెలా నర్గీస్ విలేకరులతో మాట్లాడారు. కేంద్ర కేబినెట్ మహిళల కోసం 33శాతం మహిళా బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు అభినందనలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మహిళలకు 50 శాతం కల్పించి నామినేటెడ్ పోస్ట్‌ల్లో కూడా 50శాతం రిజర్వేషన్ కల్పించి కేంద్ర ప్రభుత్వానికి కూడ సీఎం విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. దీనిపై స్పందించి మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదం చేసిన ప్రధాని నరేంద్రమోదీకి, జగన్మోహన్‌రెడ్డికి మహిళల అందరి తరుపున ఎంపిపి కృతజ్ఞతాభివందనాలు తెలిపారు.

బీసీ మహిళలను నిలువునా మోసగిస్తున్న బీజేపీ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: మహిళా రిజర్వేషన్ బిల్లు రాజకీయ ఎత్తుగడలో భాగమేనని, బీసీ అని చెప్పుకుంటున్న ప్రధాని మోదీ దేశ జనాభాలో 50శాతం పైగా ఉన్న బీసీ మహిళలను మోసం చేయడం తగదని ఐద్వా వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ సామాజికవేత్త గోళ్ళమూడి రాజా సుందర్ బాబు విమర్శించారు. గురువారం స్థానిక అంకమ్మ నగర్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయ ప్రాంతంలో ఐద్వా మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గతంలో రాజ్యసభలో పెట్టిన మహిళా బిల్లును నేడు హడావిడిగా ఎన్డీఏ ప్రభుత్వం బయటికి తీసి తామేదో మహిళలను ఉద్ధరిస్తున్నట్లు ప్రవర్తించటం తగదని అన్నారు. ప్రజలను మోసపూరిత వాగ్దానాలతో మభ్య పెడుతున్నారనీ దుయ్యబట్టారు. మణిపూర్ రాష్ట్రంలో మహిళల పట్ల జరిగిన ఆకృత్యాలను కప్పిపుచ్చేందుకే మహిళా బిల్లును తాత్కాలికంగా తెరపైకి తెచ్చారని ఆయన ఆరోపించారు. అలాగే ప్రస్తుతం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్లు 2024 ఎన్నికలకు వర్తించవని 2029 ఎన్నికలకు వర్తిస్తాయని చెప్పటం ఇది ఎన్నికల డ్రామాగా రాజా సుందరబాబు అభివర్ణించారు. ఐద్వా కార్యదర్శి ఆలూరి కోటేశ్వరి, సహాయ కార్యదర్శులు సుష్మ, సౌమ్యులు తదితరులు పాల్గొన్నారు.

నూతన రాజ్యాంగ ప్రతులు అందించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : భారత ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంటు సమావేశంలో 1950లో ప్రచురితమైన రాజ్యాంగ ప్రతులను పార్లమెంటు సభ్యులకు అందించి పార్లమెంటును అవమానపరచిందని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి గురువారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. 73 యేళ్లలో సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా భారత పార్లమెంట్ చర్చించి నాటి రాజ్యాంగానికి 105 సవరణలు చేసిందని, వీటిలో ప్రధానమైన 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ పీఠికలో 1976లో సోషలిస్ట్, సెక్యులర్ పదాలను పొందుపరచారని అన్నారు. సోషలిస్ట్, సెక్యులర్ భావాలను వ్యతిరేకిస్తున్న బీజేపీ ఆ రెండు పదాలు లేని 1950లో రూపొందించిన రాజ్యాంగ ప్రతులను 2023లో అందించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తాను చేసిన తప్పును గుర్తించి 105 రాజ్యాంగ సవరణలు పొందుపరచిన రాజ్యాంగ ప్రతులను పార్లమెంటు సభ్యులకు అందించాలని కోరారు.

గురజాడ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-తెనాలి : దేశభక్తి గేయాలు, సంస్కరణ రచనల ద్వారా జాతిని జాగృతం చేసిన నవ్యాంధ్ర సాహితీ యుగకర్త గురజాడ అని, ఆయన స్ఫూర్తితో సమాజం ముందుకు సాగాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆరేటి రామారావు పిలుపునిచ్చారు. తెనాలి గాంధీనగర్ బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ హాలులో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి, గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో గురువారం గురజాడ జయంతి సభ జరిగింది. సభకు జిల్లా అధ్యక్షులు బొల్లిముంత కృష్ణ అధ్యక్షత వహించారు. రామారావు తన ప్రసంగంలో మరో ప్రపంచానికి వెలుగు చూపిన గొప్ప కవి గురజాడ అన్నారు. మానవత్వం మనిషి కులమని గురజాడ చాటి చెప్పారన్నారు. ప్రజాకవిగా ప్రగతి వాదిగా వెలుగొందారన్నారు. తన రచనల్లో పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, బల్హణీయం, గేయకథల్లో స్త్రీ సమాజిక సమస్యలపై చక్కని అవగాహన కల్పించారన్నారు. గురజాడ రచించిన గేయం దేశమును ప్రేమించుమన్న చక్కని ప్రబోధం, నిత్యస్మరణీయం ఆచర ణీయమైనదని ప్రపంచ వ్యాప్తంగా ఆ గేయం ఆలపిస్తున్నారన్నారు. గేయరచయిత ఆళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ గురజాడ లక్ష్యాలను సర్వజనీన ఆదర్శాలను ప్రతిబింబిస్తూ సామాజిక బాధ్యతతో సాహితీ సేద్యాన్ని నెరపడం నేటి యువ రచయితల కర్తవ్యం అన్నారు. మరో రచయిత యం.వి.రఘునాధరావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ఎందరో రచయితలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన గురజాడను అందరూ గౌరవిస్తారని ఆయన బాటలో పయనిస్తారని చెప్పారు. సి.పి.ఐ. నాయకులు పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సాంఘీక దురాచారాలను తన రచనల ద్వారా ఖండించిన సాహిత్య చైతన్యమూర్తి గురజాడని శ్రద్ధాంజలి ఘటించారు. అధ్యక్షత వహించాన బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ ప్రయోజనం రీత్యా కొత్త పుంతలు తొక్కటానికి శ్రమ వికాసం పొందటానికి విశేష కృషి చేసిన మహనీయుడు గురజాడ అన్నారు. తెలుగు సాహితికి అడుగుజాడ, వెలుగుజాడ గురజాడ అంటూ స్మృత్యాంజలి ఘటించారు. గురజాడ రచనల్లో సంఘ సంస్కరణాభిలాష, శ్రమ గుర్తింపు, శాస్త్రీయత, మానవత, మూఢనమ్మకాల పట్ల ఏవగింపు వంటి మేలిమి లక్షణాలు అనేకం దర్శనమిస్తామని చెప్పారు. ఆ బాటలో ఎందరెందరో రచయితలు పయనించి తెలుగు కథానికకు వన్నె తెచ్చారని చెప్పారు. సభాప్రారంభంలో గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో సాహితీపరులు, గాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో పటిష్ట బందోబస్తు

విశాలాంధ్ర-తుళ్లూరు : అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో గురు వారం రాజధాని ప్రాంతంలో పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పా టు చేశారు. సచివాలయానికి వెళ్లే మార్గాలలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్రధాన రోడ్డు మార్గాలలో బారికేట్లు ఏర్పాటుచేసి వాహనాలను సోదా చేశారు. ప్రధానంగా రైతు దీక్ష శిబిరాలపై పోలీసులు నిఘా పెట్టారు. రైతులు, మహి ళలు దీక్ష శిబిరాల నుంచి బయటకు రాకుండా పెద్దఎత్తున మోహరించారు. మందడంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలను వ్యాపార సంస్థలను పోలీసులు మూయించారు.

కౌలు చెల్లించాలంటూ రైతుల నినాదాలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి రాజధాని రైతుల నుంచి రెండో రోజు కూడా నిరసన సెగ తగిలింది. మందడంలోని రైతు దీక్షా శిబిరం ముందుగా సీఎం జగన్ కాన్వాయ్ వెళ్తున్న సమయంలో దీక్ష శిబిరం నుంచి రైతులు మహిళలు నల్లజెండాలు, ఫ్లకార్డులు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చేందుకు యత్నించారు. దీంతో పోలీసులు అడ్డుగా నిలబడి వారిని నిలువరించారు. మే నెలలో చెల్లించాల్సిన కౌలు, వార్షిక కౌలు ఇప్పటివరకు చెల్లించలేదని, ఎప్పుడు చెల్లించేది ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని రైతులు నినాదాలు చేశారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

విశాలాంధ్ర-అమరావతి : గ్రామీణ ప్రాంతాలలోని మహిళలకు టైలరింగులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జన చైతన్య సమితి ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18-35 సంవత్సరాల లోపు వయసు కలిగిన మహిళలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. నెహ్రూ యువ కేంద్ర అనుబంధ సంస్థ జన చైతన్య సమితి ఆధ్వర్యంలో అమరావతిలోని శ్రీనివాస్ థియేటర్ సమీపంలో ఉన్న జన చైతన్య సమితి నైపుణ్య అభివృద్ధి, శిక్షణాభివృద్ధి కేంద్రంలో మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ప్రారంభమవుతుందని వివరించారు. శిక్షణ కాలం పూర్తి చేసుకున్న మహిళలకు ప్రభుత్వం నుంచి ధ్రువీకరణ పత్రాలను ఇస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు నాలుగు పాస్‌పోర్ట్ ఫోటోలు, రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్ రెండు జిరాక్స్ కాపీలతో సంప్రదించాలని కోరారు. వివరాలకు 8886777767, 9492271417 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని చెప్పారు.

అరాచకం సృష్టిస్తున్న వైసీపీని తరిమికొట్టాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు : సైకో జగన్ తన అనుభవ లేమితో ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధిని తిరోగమనంలోకి మళ్ళించారని, రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తున్న వైసీపీ సర్కా ర్‌ను వచ్చే ఎన్నికల్లో తరిమికొట్టాలని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి అర్తిమళ్ల రమేష్ అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా గురువారం పెదకూరపాడు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. వైసీపీ చేస్తున్న అక్రమ అరెస్టులను ప్రజలంతా గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. చంద్రబాబు త్వరగా విడుదల కావాలంటూ రాసిన లెటర్లను పోస్ట్ బాక్స్‌లో వేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ రాంగోపాల్‌రావు, వడ్లమూడి అప్పారావు, భాష్యం ఆంజనేయులు, మద్దినేని సత్యం, వెల్లలచెరువు సురేష్, గంటా బాబు, వడ్లమూడి కిషోర్, జాగర్లమూడి రఘు, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయమే లక్ష్యంగా పశు కిసాన్ క్రెడిట్ పథకం

విశాలాంధ్ర-బొల్లాపల్లి : పాడి రైతుల సంక్షేమం కోసం పలు రకాల పథకాలను ప్రవేశపెడుతూ వస్తోన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరో కొత్త పథకాన్ని తీసుకువచ్చాయని, పశు కిసాన్ క్రెడిట్ కార్డుతో తీసుకొచ్చిన ఈ కొత్త పథకం ద్వారా రూ.3 లక్షల వరకు ప్రయోజనం పొందే అవకాశం కల్పించాయని పాడి రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టాయని పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పయ్యావుల శ్రీనివాసమూర్తి అన్నారు. మహిళా పాడి రైతులతో రుణ మేళా సదస్సును మండలంలోని వడ్డేంగుంట గ్రామంలో గురువారం నిర్వహించారు. పాడి పశువుల రుణమేళాకు హాజరైన ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు అధిక ఆదాయం సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, పాలవెల్లువ కార్యక్రమంలో మహిళలను భాగస్వాములను చేస్తే వారి ఆర్థిక పురోగతి సాధ్యమవుతుందన్నారు. అమూల్ డెయిరీకి పాలుపోస్తే అధిక ఆదాయం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లాపల్లి పశువైద్యాధికారి పి.అమీర్ భాష, డీఆర్‌డీఏ వెలుగు సిబ్బంది, గోపాల్ మిత్ర ఎం.సుబ్బారావు, మహిళా పాడి రైతులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని పోలీస్‌స్టేషన్

విశాలాంధ్ర-అచ్చంపేట : సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని అచ్చంపేట మండలం కేంద్రంలో కోట్ల రూపాయలు పెట్టి నిర్మించిన పోలీస్ స్టేషన్ ప్రారంభానికి నోచుకోలేదని స్థానిక ప్రజలు తెలిపారు. పాతకాలం నాటి స్టేషన్లోనే పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అన్ని రకాల సదుపాయలతో ఆధునీకరణంగా కట్టిన నూతన భవనాన్ని ప్రారంభిస్తే అన్ని సౌకర్యాలు ఉంటాయని త్వరలో ప్రారంభించాలన్నారు.

ఘనంగా గురజాడ అప్పారావు జయంతి

విశాలాంధ్ర-పెదకూరపాడు : తెలుగు రచయిత, మహాకవి గురజాల అప్పారావు జయంతి వేడుకలు పెదకూరపాడు జడ్పీ హైస్కూల్లో, మండల పరిధిలోని 75 తాళ్లూరు జడ్పీ హైస్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రమణ, తాళ్లూరు హెచ్‌ఎం అన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గురజాడ రాసిన కన్యాశుల్కం నాటకానికి సాహితీ లోకంలో ఒక ప్రత్యేకత స్థానం ఉందని అన్నారు. పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, ముత్యాల సరాలు, దేశమును ప్రేమించుమన్నా దేశభక్తి గీతం మొదలైన రచనలు రచించారని అన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఉపాధ్యాయుల బృందం నివాళులర్పించారు.

ఐకాన్ అవార్డుకు ప్రధానోపాధ్యాయుడు

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని 75 తాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డికి విద్యారంగంలో విశిష్టమైన కృషి చేస్తున్నందుకు గాను ఐకాన్ అవార్డు-2023 జాతీయ పురస్కారాన్ని ఇస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన శ్రీ సాయి అలేఖ్య సాంస్కృతిక సేవ సంస్థ అధ్యక్షులు ఉపద్రష్ట అరుణ అశోక్ గురువారం ప్రకటించారు. వివిధ రంగాల్లో విశేషమైన సేవ చేసినందుకు ఇచ్చే ఈ అవార్డును విద్యారంగంలో 27 సంవత్సరాలు విశిష్ట కృషి చేస్తున్నందుకు శ్రీనివాస రెడ్డికి ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 23న హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగే కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులచే ఈ అవార్డు ప్రదానం చేయబడుతుందని అన్నారు. ఈ అవార్డు ఎంపికైన శ్రీనివాస్ రెడ్డిని పీసీ చైర్మన్ జి.శ్రీనివాస రెడ్డి, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

28 నుంచి సువార్త స్వస్థత మహాసభలు

విశాలాంధ్ర-మాచర్ల : పట్టణంలోని సాగర్ రోడ్‌లో ఉన్న ది పెంతెకోస్తు మిషన్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి అక్టోబర్ 1వ తేది వరకు నాలుగు రోజులు ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు సువార్త స్వస్థత మహాసభలు జరుగనున్నట్లు గురువారం చర్చి సంఘ పెద్దలు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 28వ తేదీన భారీ ఖర్చుతో నూతనంగా నిర్మించిన ఆలయాన్ని ప్రతిష్ఠించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఏభేదం లేకుండా ప్రతి ఒక్కరిని ఆహ్వానిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సభలలో రోగుల కోసం ప్రత్యేకంగా ప్రార్ధనలు చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

గణేష్ విగ్రహ నిమజ్జన మహోత్సవం

విశాలాంధ్ర-విజయపురి సౌత్ : హరిత రిసార్ట్స్‌లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు దత్తు ఆధ్వర్యంలో స్వామి వారికి ఉదయం నుంచే పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. వినాయక లడ్డును సభావత్ సోమ్లా నాయక్ రూ.12600లకు దక్కించుకున్నారు. అనంతరం గణేష్ విగ్రహాన్ని సాగర్ జలాశయంలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కంట్రోల్ రూమ్ మేనేజర్ స్వామి, ఎత్తిపోతల మేనేజర్ యల్లాల బ్రహ్మం,లాంచీ స్టేషన్ మేనేజర్ వినయతుల్లా, పులుసు వీరారెడ్డి, మస్తాన్ రావు,మధు, రామారావు, ఉప్పుతోళ్ల అశోక్, హనుమ నాయక్, బండి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైసీపీకి పతనం తప్పదు: షరీఫ్

విశాలాంధ్ర-వినుకొండ: ఎటువంటి ఆధారాలు లేకుండా స్కిల్ డెవలప్మెంట్ కేసులో అవినీతికి పాల్పడ్డారంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు చేసి 13 రోజులుగా జైలులో ఉంచటం అత్యంత దారుణమని మాజీ శాసనమండలి చైర్మన్ ఎండీ అహ్మద్ షరీఫ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దుశ్చర్యలను ఎండగట్టారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ తక్షణం జైలు నుండి విడుదల చేయాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి తొమ్మిదవ రోజు చేరుకున్నాయి. అరుణ హాల్ సెంటర్ మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ గంగినేని వెంకటేశ్వర రావు విగ్రహం ఎదుట నిర్వహిస్తున్న దీక్షల్లో గురువారం పెద్ద ఎత్తున ముస్లిం మైనార్టీలు. నూర్భాషీయులు. పాల్గొన్నారు. పట్టణ టిడిపి అధ్యక్షులు అయుబ్ ఖాన్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా విచ్చేసిన షరీఫ్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబు పేరు లేకపోయినా 37వ ముద్దాయిగా చంద్రబాబు పేరు చేర్చడం దారుణం అన్నారు. 151 ఎమ్మెల్యే స్థానాలు గెలుచుకున్నామన్న మదంతో జగన్ రెడ్డి ప్రతిపక్షాల గొంతు నొక్కి తిరిగి రానున్న ఎన్నికల్లో గెలవాలని అహంకారంతో ఉన్నాడని షరీఫ్ అన్నారు. బాబు హయాంలో ఏర్పడిన స్కిల్ డెవలప్మెంట్ లక్షలాది మంది యువతకు ఉపాధి దక్కిందని 90 వేల మందికి పైగా మంచి ఉద్యోగాలు లభించాయని 42 శిక్షణా కేంద్రాల్లో యువతి యువకులు మంచి శిక్షణ పొందారని దీనిపై కేంద్ర ప్రభుత్వం కూడా గుర్తించి మెరిట్ సర్టిఫికెట్లు జగన్ రెడ్డి హయాంలోనూ ఇచ్చిన సంగతి మర్చిపోయారా అని షరీఫ్ ప్రశ్నించారు. నేడు చంద్రబాబును రాజకీయంగా ఎదుర్కొనలేక కుట్ర పూరితంగా అరెస్టు చేశారన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ టీడిపి పొత్తుతో ముందుకు వస్తున్నారన్నారు. బాబుపై పెట్టిన తప్పుడు కేసులకు ఏమాత్రం భయపడేది లేదని రానున్న ఎన్నికల్లో వైసీపీకి సమాధి తప్పదని షరీఫ్ హెచ్చరించారు. పల్నాడు జిల్లా టీడిపి అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు మాట్లాడుతూ టిడిపి హయాంలోనే ముస్లింలు ఆర్థిక అభివృద్ధి సాధించారన్నారు. జైలు నుండి చంద్రబాబు బయటకు వస్తే జగన్ రెడ్డికి మనుగడ ఉండదని ఏ కేసుల్లో ఇరికిద్దామా అని కుట్ర పన్నుతున్నారని వైసీపీకి సమాధి తప్పదని జీవి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ టిడిపి అధ్యక్షులు ముక్తార్ అహ్మద్, జిల్లా టిడిపి అధ్యక్షులు మైనార్టీ పల్నాడు అమీరు అలి, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి షమిం ఖాన్, పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ అయుబ్ ఖాన్, రాష్ట్ర టీడిపి మైనార్టీ నాయకులు సౌదాగర్ జానీ భాష, సీనియర్ న్యాయవాది సిద్దయ్య, అకుమళ్ళ కాశిమ్, షేక్ ఖాసిం, షేక్ కరిముల్ల, దబ్బాల సుభాని, గోల్డ్ కరిముల్ల, రియల్ ఎస్టేట్ జానీ, పరేషా, యూత్ జానీ, సిద్దరపు ఫరీద్, పట్టేషా, సహెబా పాల్గొన్నారు.

రాష్ట్రంలో నియంత పాలన: మారుతి

విశాలాంధ్ర-వినుకొండ: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతున్నదని పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి ఏ మారుతి వరప్రసాద్ అన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆయన్ని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ. టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 9వ రోజుకు చేరాయి. అరుణ హాల్ సెంటర్లో జరుగుతున్న ఈ దీక్షలకు తమ పూర్తి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్రంలో చంద్రబాబు తిరగకుండా తప్పుడు కేసులు బనాయించి జైలు పాలు చేసి, బయటకు రాకుండా జగన్మోహన్ రెడ్డి మరిన్ని కేసులు వెతుకుతున్నాడని విమర్శించారు. ముందస్తు ఎన్నికల కోసం జగన్మోహన్ రెడ్డి ఆరాటపడుతున్నాడని ప్రతిపక్షాలపై కేసులు బనాయించి జైలు పాలు చేసి తిరిగి ఎన్నికల్లో గెలవాలని కలలుగంటున్నాడని ఆయన అన్నారు. ఎటువంటి ప్రాథమిక ఆధారాలు లేకుండా చంద్రబాబును అరెస్టు చేయడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా కాకుండా విదేశాల నుంచి పెద్ద ఎత్తున చంద్రబాబుకు మద్దతు లభిస్తుండగా జగన్ రెడ్డిని శాపనార్థాలు పెడుతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తానన్న జగన్ నాలుగేళ్లుగా కేంద్రం పెద్దల వద్ద పాదాభివందనాలు చేస్తూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. చంద్రబాబు హయాంలోనే స్కిల్ డెవలప్మెంట్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల యువతి యువకులు మంచి నైపుణ్యం సాధించి విదేశాల్లో మంచి ఉద్యోగాలు పొందారని మారుతి అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే విధంగా టిడిపికి లౌకిక పార్టీలకు సిపిఐ ఎల్లప్పుడు అండగా ఉంటూ ప్రజా సమస్యల పోరాటానికి తోడుగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ సంద్రపాటి సైదా, ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, బొల్లాపల్లి సిపిఐ మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, ఆర్.వందనం, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

గీతా ముఖర్జీ పోరాట ఫలితమే మహిళా బిల్లు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కావాలని జీవితాన్ని త్యాగం చేసిన ధన్యజీవి గీతా ముఖర్జీ పోరాట ఫలితమేనని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామ సుబ్బాయమ్మ తెలిపారు మహిళా బిల్లు లోక్ సభలో ఆమోదం పొందడం పట్ల ఏపీ మహిళా సమాఖ్య పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం పండరీపురంలో మహిళలు హర్షం ప్రకటించి సంబరాలు జరుపుకున్నారు. ముందుగా మహిళా రిజర్వేషన్ బిల్లుకు మూలకారణమైన గీతా ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుబ్బాయమ్మ మాట్లాడుతూ మహిళలకు చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని గత 27 సంవత్సరాలుగా పోరాటం సాగుతోందన్నారు. గీతా ముఖర్జీ ఉభయ సభల జాయింట్ సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా రాష్ట్రాలన్నీ పర్యటించి 1996 సెప్టెంబరు 12న మహిళా బిల్లు ప్రవేశపెట్టారని తెలిపారు మహిళా రిజర్వేషన్ బిల్లు భారత జాతీయ మహిళా సమైక్య నాయకురాలు గీతా ముఖర్జీ పోరాట ఫలితమేనని, ఆమె మహిళలకు సంబంధించిన అనేక కమిటీల్లో ఉన్నారని సామాజిక న్యాయం, మహిళల హక్కుల కోసం పోరాటంలో తన బలమైన గళాన్ని వినిపించారని గుర్తు చేశారు. పురుషులతో సమానంగా మహిళలకు అవకాశాలు అందితేనే దేశం పురోగాభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి బి లలితకుమారి, సభ్యులు ఎం వెంకట్రాది, జి సుబ్బాయమ్మ, నరసమ్మ, ఎస్ నాగేంద్రం, ఎస్ కాశింబి తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వే పరిశీలించిన తహాశీల్దార్

విశాలాంధ్ర-దుర్గి: భూ రీసర్వే కార్యక్రమానికి రైతులు రీసర్వే సిబ్బందికి సహకరించాలని తహాశీల్దార్ జి.రమేష్ కుమార్ కోరారు. మండల పరిధిలోని ధర్మవరం రెవిన్యూ గ్రామంలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. మూడు రోజుల్లో రీసర్వే పూర్తి చేసేందుకు ఆరు బ్యాచ్‌లు పనిచేస్తున్నట్లు తహాశీల్దార్ తెలిపారు.

ఆర్ఎంపీ వైద్యులకు సన్మానం

విశాలాంధ్ర-రొంపిచర్ల: స్థానిక రాజుల బజారులో గల శ్రీ నీలం పాటి అమ్మవారి పుట్ట వద్ద బుధవారం రాత్రి మండల ప్రజానీకానికి విశిష్టమైన వైద్యసేవలందించిన ఆర్ఎంపి వైద్యులు డాక్టర్ మెండు సత్యనారాయణ (తెనాలి డాక్టర్)కు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పుట్ట వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్న గ్రామ పెద్దలు మాట్లాడుతూ 47సంవత్సరాల క్రితం తెనాలి పట్టణం నుండి రొంపిచర్లకు ఆర్ఎంపి వైద్యులు మెండు సత్యనారాయణ వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారని అన్నారు. గ్రామంతో పాటు పరిసర గ్రామాలకు వారికి వైద్యసేవలు అందిస్తూ తెనాలి డాక్టర్‌గా ప్రసిద్ధి పొందారు. ఆయన వృత్తి నుండి విశ్రాంతి తీసుకుని తన స్వగ్రామానికి వెళ్ళటం బాధాకరమని అన్నారు. అనంతరం పుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయనను ఘనంగా సన్మానించారు. అదే విధంగా ఇటీవల జాతీయ స్థాయిలో మహానంది పురస్కారం పొందిన రంగస్థల కళాకారులు చక్రవరం బలరామరాజును కూడా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గెల్లి సుబ్బారెడ్డి, గ్రామ పెద్దలు పులుకూరి మస్తాన్, ధేనువకొండ సత్యనారాయణరాజు, గొడవర్తి వెంకటేశ్వర్లు, బిసి సంక్షేమ సంఘం మండల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈక్రాఫ్ నమోదు చేయించుకోవాలి

విశాలాంధ్ర-దుర్గి: మండలంలో పంట సాగు చేసిన రైతు ప్రతి ఎకరా ఈ-పంట నమోదు చేసుకోవాలని గురజాల ఆర్.డీ.ఓ. అద్దెయ్య సూచించారు. గురువారం దుర్గిలో జరుగుతున్న ఈక్రాఫ్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు పంట నమోదు ద్వారానే నష్టపరిహారం పొందడానికి వీలుంటుందని, కావున ప్రతి రైతు ఆయా గ్రామాలోని రైతు భరోసా కేంద్రంలోని అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు, గ్రామ రెవిన్యూ అధికారులను సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహాశీల్దార్. జి.రమేష్ కుమార్,మండల సర్వేయర్ రఘుపతి, హార్టికల్చర్ అసిస్టెంట్ రాఘవ, అగ్రికల్చర్ అసిస్టెంట్. బి.కోటేశ్వరనాయక్, విఆర్వో. టి.కోటేశ్వరరావు,సర్వే అసిస్టెంట్లు ఉన్నారు.

పల్నాడు వాసికి అక్కినేని పాన్ ఇండియా పురస్కారం

విశాలాంధ్ర-దుర్గి : హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఈ నెల 20న అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా ఆయన కాంస్య విగ్రహన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొందరు సీనియర్ అక్కినేని అభిమానులను హైదరాబాదులోని ప్రసాద్ ల్యాబ్‌లో అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి పాన్ ఇండియా అవార్డులను ప్రముఖ దర్శకుడు వైవీఎస్ చౌదరి చేతుల మీదుగా అందజేశారు. పల్నాడు జిల్లా, దుర్గికి చెందిన సీనియర్ అక్కినేని అభిమాని పురం చెన్నకేశవరావుకు అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు సినిమా వేదిక అధ్యక్షులు చైతన్య జంగా, సెక్రటరీ విజయ్ వర్మ పాకాలపాటి, సీనియర్ నటులు మురళీమోహన్, కాదంబరి కిరణ్ కుమార్, గౌతమ్ రాజు పలువురు చిత్ర పరిశ్రమకు చెందిన వారు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర-శావల్యాపురం : జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పేరుమీన శీతారా మయ్య అన్నారు. మండలంలోని కనమర్లపూడి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్ర మంపై ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ నుంచి ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు ప్రతి గడపకూ వెళ్లి ఇంటింటి ఆరోగ్య సర్వే చేస్తున్నారని, ఈ సర్వేలో ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య సురక్ష ఉద్దేశాన్ని ప్రజలకు వివరిస్తూ ఇంటిలో ఉన్న కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలను గుర్తించి వారికి జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్ అందజేస్తారని తెలిపారు. అలాగే సర్వే నిర్వహించే సమయాన ఇంటి వద్దనే బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, మలేరియా, డెంగీ, కళ్లె పరీక్షలు చేస్తారని తెలిపారు. ఈ పరీక్షలో గుర్తించిన వ్యాధులకు అవసరమైన మందులను ఇంటి వద్దనే అందజేస్తారన్నారు. ఎఎన్ఎం రాజ్యలక్ష్మి, పృధ్వీరాణి, మండల రిసోర్స్ పర్సన్ గుండాల కోటేశ్వరరావు, అశా కార్యకర్తలు పూర్ణిమ, మరియమ్మ, తదితరు పాల్గొన్నారు.

కాశీ విశ్వనాథ్‌కు ప్రత్యేక గుర్తింపు

విశాలాంధ్ర-శావల్యాపురం : పక్షవాత వ్యాధి లక్షణాలలో అరుదైన రకంపై జరిపిన పరిశోధనలో మండలంలోని మతుకుమల్లి గ్రామానికి చెందిన ప్రముఖ స్టాంప్ రైటర్ మతుకుమల్లి రామకృష్ణ కుమారుడు కాశీ విశ్వనాథ్‌కు ప్రత్యేక గుర్తింపు లభించింది. కేరళ రాష్ట్రంలోని అమృత విశ్వ విద్యాపీఠంలో కాశీ విశ్వనాథ్ స్కూల్ ఆఫ్ బయోటెక్నాలజీ చదివే సమయంలో న్యూరో సైన్స్ విభాగ అధికారి శ్యాందివాకర్, పీహెచ్‌డీ స్కాలర్ డాక్టర్ హేమలతల నేతృత్వంలో కాశీ విశ్వనాథ్‌తో పాటు మరో నలుగురు విద్యార్థులు టీంగా ఏర్పడి పక్షవాతంలో అరుదుగా వచ్చే రకంపై పరిశోధన జరిపారు. ఏడాది పాటు జరిగిన పరిశోధనను 2022 జూన్‌లో పూర్తి చేశారు. 2023 ఫిబ్రవరిలో సిక్కిం రాష్ట్రంలో వివిధ రకాల పరిశోధనలపై ప్రపంచ వ్యాప్తంగా జరిగిన రిప్రజంటేషన్ సదస్సులో టీం తరపున కాశీ విశ్వనాథ్ సిక్కింకి వెళ్ళి ప్రెజంటేషన్ ఇచ్చారు. కాశీ విశ్వనాథ్ ఇచ్చిన ప్రెజంటేషన్‌ను మెచ్చిన ప్రతినిధులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపునిస్తూ స్పింజర్ ఆన్లైన్ జనరల్ ఇంటర్నెట్‌లో గురువారం పబ్లిష్ చేసినట్లు కాశీ విశ్వనాథ్ తెలిపారు. ఈ ఘనత సాధించిన కాశీ విశ్వనాథ్, టీం సభ్యులను పలువురు ప్రముఖులు అభినందించారు.

182 బూత్‌ను కొనసాగించండి

విశాలాంధ్ర-పెదకూరపాడు : ఓటు హక్కు వినియోగించుకుని ఓటర్లకు బూత్ ఒకచోట నివాసం మరొక చోట ఉందని 182వ బూత్ యధావిధిగా కొనసాగించాలని తహశీల్దార్ క్షమారానికి శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో టీడీపీ నేతలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్ మాట్లాడుతూ మండల పరిధిలోని ఖమ్మంపాడు గ్రామంలో 184వ బూత్ ఊరి చివర గల పాఠశాల వద్దకు మార్చారని, దీనిని కూడా ప్రజల ఇబ్బందులు దృష్ట్యా ప్రాథమిక పాఠశాలలోనే కొనసాగించాలని కోరారు. మండలంలో 151, 152, 153 ఆర్సీఎం ప్రైమరీ స్కూల్‌లోనే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బెల్లంకొండ రామ్‌గోపాల్ రావు, భాష్యం ఆంజనేయులు, వడ్లమూడి కిషోర్, రఘు, వెల్లలచెరు సురేష్, భాష్యం సత్యనారాయణ, మిలిటరీ మౌలాలి, షేక్ ముంతాజ్, వడ్లమూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పుట్లగూడెంలో గణనాథుని నిమజ్జనం

విశాలాంధ్ర-అచ్చంపేట : మూడు రోజులుగా పూజలు అందుకున్న గణనాథుడు గురువారం పుట్లగూడెం కృష్ణా నదిలో నిమజ్జనం చేశారు. నరసరావుపేట గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణనాథుని పూజించి పుట్లగూడెం తరలించారు. బోలో గణేష్ మహారాజ్‌కు జై అంటూ నినాదాలు చేసి స్వామివారిని ప్రార్థించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పత్రాలను నీళ్లలో సమర్పించి గణనాథుని నదిలో వేసి నిమజ్జనం చేశారు.

సంక్షోభాలు టీడీపీకి కొత్తేమి కాదు: చదలవాడ

విశాలాంధ్ర-నరసరావుపేట : తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా 9వ రోజు నరసరావుపేటలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు రిలే నిరసన దీక్షలో పాల్గొ న్నారు. ముఖ్యమంత్రి జగన్నాటకానికి ప్రజలు తెర దించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు టీడీపీ అదరదు...బెదరదని, సంక్షోభాలు తెలుగుదేశం పార్టీకి కొత్తేమీ కాదన్నారు. ఇబ్బందులను ఎదుర్కొనే సత్తా తమ పార్టీ శ్రేణులకు ఉందని, మా నాయకుడు చంద్రబాబును అరెస్టు చేసి తాత్కాలికంగా రాక్షసానందం పొందొచ్చుగానీ త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య అధ్యక్షతన వహించారు. పమిడిపాడు గ్రామ సీనియర్ నాయకులు పూనాటి రామదాసు "బాబుతో నేను" ప్లకార్డు పట్టుకుని సంఘీభావం తెలిపారు. సాయంత్రం చదలవాడ అరవింద బాబు, రాష్ట్ర డాక్టర్ సెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, పార్టీ క్రమ శిక్షణ సంఘం మెంబర్ గుంటుపల్లి నాగేశ్వరావులు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేములపల్లి వెంకట నరసయ్య, పూదోట రాయన్న, బొడ్డపాటి పెరయ్య, గొట్టిపాటి జనార్దన్ బాబు, వాసిరెడ్డి రవి, పులిమి రామిరెడ్డి, మక్కెన ఆంజనేయులు, కడియం కోటి సుబ్బారావు, కొల్లి వెంకటేశ్వర్లు, దండ శివరామకృష్ణ పాల్గొన్నారు.

మహాసభల గోడపత్రికలు ఆవిష్కరణ

విశాలాంధ్ర-వినుకొండ: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎం యు 22వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను సీపీఐ ఆఫీస్ శివయ్య భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి పిన్నిపోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు ఈనెల 25 26 27 తేదీల్లో బాపట్ల నగరంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని, ఈ మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో హాజరవుతారని, వినుకొండ నియోజకవర్గం నుంచి కూడా పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆరు వందనం, బి.సురేష్, వరదరాజులు, కొప్పెరపు మల్లికార్జున, లక్ష్మీ సుజాత, పద్మ తదితర నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-నరసరావుపేట : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 25, 26, 27 తేదీలలో బాపట్ల జిల్లాలో జరుగుతున్నాయని, ఈ మహాసభకు పల్నాడు జిల్లా నుంచి వ్యవసాయ కార్మికులు, రైతులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ హుస్సేన్ పిలుపునిచ్చారు. గురువారం మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించిన అనంతరం హుస్సేన్ మాట్లాడుతూ 25వ తేదీ వేలాది మందితో కూలి దండు మహా ప్రదర్శన అనంతరం బాపట్ల రథం సెంటర్లో బహిరంగ సభ జరుగుతుందని, ఈ బహిరంగ సభకు భారతీయ కేత్ మజ్దూర్ యూనియన్(బీకేఎంయూ) జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గుల్జార్ సింగ్ గోరియా, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ జంగాల అజయ్ కుమార్ పాల్గొంటారని అన్నారు. వ్యవసాయ కార్మికులు ఉపాధి హామీ కూలీలు 25వ తేదీ జరుగు కూలి దండు మహాప్రదర్శనలో పల్నాడు జిల్లా నుంచి వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బూదాల శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాస్ రెడ్డి, సౌటుపల్లి నాగేశ్వరరావు, చెరుకుపల్లి నిర్మల, రంగనాయకులు, పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, పేతురు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ఇన్‌చార్జ్ ఏపీపీగా బుచ్చిదంతాచారి

విశాలాంధ్ర-నరసరావుపేట : నరసరావుపేట అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బుచ్చిదంతచారిని 13వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జ్ ఏపీపీగా నియమిస్తూ ఏపీ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఏపీపీగా పనిచేసిన కాకుమాను బాల హనుమంత రెడ్డి పదవీకాలం ఈ నెల 15వ తేదీతో ముగిసింది. జిల్లా కోర్టు ఇంచార్జీ ఏపీపీగా నియమితులైన బుచ్చిదంతాచారిని పలువురు సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

ఎంబీబీఎస్ కౌన్సిలింగ్‌లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు అన్యాయం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వారు చేపట్టిన ఎంబిబిఎస్ కౌన్సిలింగ్‌లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు అన్యాయం జరిగిందని. విముక్త చిరుతల కక్షి (వి సి కె)పార్టీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి, చిలకలూరిపేట నియోజకవర్గ ఇన్చార్జి వంజా ముత్తయ్య అన్నారు. గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎక్కువ మార్కులు వచ్చిన వారికి రిజర్వేషన్ కేటగిరీలో, తక్కువ మార్కులు వచ్చిన వారికి ఓపెన్ కేటగిరిలో సీట్లు కేటాయించి, రిజర్వేషన్ కేటగిరిలో సీట్లను పొందవలసినటువంటి అభ్యర్థులకు అన్యాయం చేశారని ఆరోపించారు, గతంలో న్యాయస్థానాలు సుప్రీంకోర్టు గైడెన్స్ ప్రకారం ప్రతిప ఆధారంగా ఓపెన్ కేటగిరిలో నియామకాలు చేపట్టాలని ఇచ్చిన సూచనలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా కోర్టు ఉత్తర్వులను తుంగలో తొక్కారని, అన్యాయంగా యూనివర్సిటీ అధికారులు ప్రవర్తించారని విమర్శించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ చిలకలూరిపేట నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఎన్‌ఆర్‌టి సెంటర్ వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో కార్యక్రమం నిర్వంచారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు నరసింహారావు మాదిగ మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాలలో వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టకపోతే బిజెపికి గుణపాఠం చెబుతామని తెలిపారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు అద్దంకి బాబు తదితర నాయకులు పాల్గొన్నారు. అనంతరం పట్టణ ఎస్సై మోహన్ పోలీసు సిబ్బంది ఆందోళనకారులను అదుపులోకి తీసుకోవడం జరిగింది. అనంతరం నాయకులు బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేసి మీడియాతో మాట్లాడారు.

బహిరంగ ప్రకటన

గుంటూరుజిల్లా, పెదనందిపాడు(మం), పాలపర్రు గ్రామం, డోర్ నెం.2-98, మారెళ్ళ శ్రీనివాసరావు గారి కుమార్తెయున్ను, ప్రత్తిపాటి నరేష్ బాబు గారి భార్య అయినా మారెళ్ళ ప్రవంతి ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మంది ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని నాక్షయింట్ 1)ప్రత్తిపాటి ఏడుకొండలు గారి కుమారుడు లక్ష్మీనరసయ్య ఈయన కుమార్తెలు 2)మారెళ్ళ అంటయ్య గారి భార్య మారెళ్ళ వెంకట నరసమ్మ, 3)మారెళ్ళ శ్రీనివాసరావు గారి భార్య మారెళ్ళ రేణుకాదేవి, 4) దగ్గుబాటి నాగేశ్వరరావు గారి భార్య దగ్గుబాటి నాగమల్లేశ్వరి, 5)ప్రత్తిపాటి హరనాద్ గారి భార్య ప్రత్తిపాటి అనిత, గిఫ్ట్ సెటిల్మెంట్ ద్వారా సంక్రమించబడి నాక్షయింట్ పేరు మీద ఒక సెటిల్మెంట్ దస్తావేదును వ్రాయించి చిలకలూరిపేట సబ్ రిజిస్టర్ వారి ఆఫీస్ లో రిజిస్టర్ కాబడిన దస్తావేదు నెంబర్ 13094/2022 ద్వారా నాక్షయింట్‌కి సంక్రమించబడి తదాది నాక్షయింట్ సంపూర్ణ హక్కు భుక్తములు కలిగియున్నారని మరియు దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని "కెన్ఫిన్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్" గుంటూరు శాఖ వారి వద్ద తనఖా ఉంచి ఋణం తీసుకొనుచున్నారు. కావున ఎవరికైనను సదరు ఆస్తి గురించి గాని, హక్కులు గురించి గాని అభ్యంతరాలు ఉన్నయెడల లిఖిత పూర్వకంగా తగిన దస్తావేజులతో ఈ నోటీసు ప్రకటించిన (ఏడు) దినముల లోపు, ఈక్రింది సంతకందారుని సంప్రదించగలరు. లేనియెడల ఎవ్వరికీ ఏవిధమైన అభ్యంతరాలు గాని, హక్కులు గాని లేవని భావించి దిగువ షెడ్యూల్ ఆస్తి పై ఋణము తీసుకొనగలరు. [illegible]

కాసు వెంకట రెడ్డి, అడ్వకేట్ [illegible] గుంటూరు, సెల్: 9346983822

బహిరంగ ప్రకటన

[illegible] నాక్షయింట్ అయిన రెప్కో హోం ఫైనాన్స్ లిమిటెడ్, గుంటూరు వారి సూచనలమేరకు యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని అకుల [illegible] కోటేశ్వరరావు ది.16.10.2018న అకుల సుశీల గారు దస్తావేజు నెం.7029/2018గా, చిలకలూరిపేట సబ్.రిజిస్ట్రర్‌లో సెటిల్మెంట్ దస్తావేదు ద్వారా దఖలు పరచినారని అట్టి ఆస్తిని తనఖాగా ఉంచి నాక్షయింటు కంపెనీలో లోను తీసుకొనుటకు ప్రయత్నిస్తున్నారని అట్టి ఆస్తిపై ఎవరికైనాను ఏవైనా అభ్యంతరాలు గాని ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన వారం రోజులు లోపల ఈ దిగువ తెలిపిన చిరునామాకు లిఖిత పూర్వకముగా తెలియజేయగలరని యావన్మంది ప్రజానీకానికి తెలియజే[illegible]

కాసు వెంకట రెడ్డి, అడ్వకేట్ [illegible] గుంటూరు, సెల్: 9346983822

పౌష్టికాహారంతో ఆరోగ్యం

విశాలాంధ్ర-పర్చూరు: తల్లులు, గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవటం వలన బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపిడిఓ ప్రద్యుమ్నకుమార్ తెలిపారు. మండలంలోని ఎడారిపల్లెలో గురువారం పోషణ మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా తల్లులుకు, గర్భవతులకు, బాలింతలకు పోషణపై అవగాహనకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార కిట్లను ఉపయోగించుకొని బిడ్డల రక్త హీనతను నివారించాలని సూచించారు. ఐదు ఏళ్ళలోపు పిల్లలకు గ్రామంలో దొరకే రాగులు, సజ్జలు, జొన్నలు వంటి చిరుధాన్యాలను వాడాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బిరుదు నాగేంద్రమ్మ, సూపర్‌వైజర్ అన్నపూర్ణ, కార్యదర్శి కె.శ్రీనివాసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

టీడీపీ దీక్షలు కొనసాగింపు

విశాలాంధ్ర-పర్చూరు: చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను నిరసనగా స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ నాయకులు రిలేనిరాహారదీక్ష కొనసాగుతున్నాయి. దీక్షకు సంఘీభావంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర్‌బాబు పాల్గొన్నారు. బాబు అరెస్ట్ అక్రమమని నినాదాలు చేశారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనంలో కొట్లాట

విశాలాంధ్ర - కొల్లూరు : గణేష్ నిమజ్జనంలో ఇరు సామాజిక వర్గాల నడుమ కొట్లాట చోటుచేసుకుని ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకున్న సంఘటన బుధవారం అర్ధరాత్రి కొల్లూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొల్లూరు బైపాస్ రోడ్డులో ఓ సామాజిక వర్గానికి చెందిన యువకులు ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జన ఊరేగింపు జరుగుతున్న సమయంలో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ సినిమా పాటలు వేసే విషయంలో అదే ప్రాంతానికి చెందిన మరో సామాజిక వర్గంకు చెందిన యువకులకు, విగ్రహం ఏర్పాటు చేసిన వ్యక్తుల మధ్య వివాదం మొదలైంది. ఘర్షణ కాస్తా కొట్లాటకు దారితీయడంతో విగ్రహం ఏర్పాటు చేసిన యువకులపై మరో సామాజిక వర్గంకు చెందిన యువకులు దాడికి తెగబడ్డారు. కొట్లాట సమాచారం అందుకున్న ఎస్ఐ రాజ్యలక్ష్మి ఉద్రిక్త వాతావరణంను సద్దుమణిచి నిందితులను అదుపులోకి తీసుకుంటామని హామీ ఇవ్వడంతోపాటు, కొట్లాటలో గాయాల బారిన పడిన ఈమని వరప్రసాద్, ఈమని కాళీకృష్ణభార్గవ, ఈమని కిశోర్‌లను వైద్యసేవల నిమిత్తం తెనాలి వైద్యశాలకు తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొమ్మిది మంది యువకులైన పడమటి నాగబాబు, పడమటి జనార్ధన్, అనగాని మహేష్, అనగాని రాజేష్, ఉయ్యూరు ప్రసాద్, మట్టా చందు, జంపాని రామయ్య, జోగి సాయిసన్నీ, శౌంరి భానుప్రకాష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వై. అర్జున్ తెలిపారు.

దళితుల స్మశానవాటికకు స్థలం కేటాయించండి

విశాలాంధ్ర - చీరాల : తోటవారిపాలెం గ్రామ పంచాయతీలోని రంగరావుపేట, వీరయ్య నగంలకు స్మశాన వాటిక ఏర్పాటుకు స్థలం కేటాయించాలని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలాని డిమాండ్ చేశారు. దళిత బహుజన పార్టీ ఆధ్వర్యంలో తోటవారిపాలెం గ్రామ పంచాయతీలోని రంగారావుపేట, వీరయ్య నగర్‌లోని ఎస్సీలకు స్మశాన వాటికకు స్థలాన్ని వెంటనే కేటాయించాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలానీ మాట్లాడుతూ తోటవారిపాలెం గ్రామంలో ఉన్న దళితులు యాబై ఏళ్ల క్రితం అంబేద్కర్ నగర్‌లో నివసించేవారని, జనాభా పెరుగుదలతో అంబేద్కర్ నగర్ నుంచి విడిపోయి రంగరావుపేట, వీ రయ్య నగర్‌లు ఏర్పడ్డాయన్నారు. అంబేద్కర్ నగర్‌లో ఉన్నప్పుడు ప్రభుత్వం సర్వే నంబర్ 760/3లో 81 సెంట్లు స్థలం కేటాయించిందని, గ్రామాలు విడిపోయి, జనాభా పెరిగి గ్రామాలు వేరుపడినప్పటికి దళితులకు స్మశాన వాటికలకు స్థలాలు కేటాయించలేదన్నారు. రంగరావుపేట, వీరయ్య నగర్‌లు ఏర్పడి సుమారుగా యాబై ఏళ్ళు గడుస్తున్నప్పటికి అక్కడి ఎస్సీలకు స్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రంగారావు పేట, వీరయ్య నగర్ నుంచి మృతదేహం తీసుకెళ్లాలంటే సుమారుగా వెళ్లడం 4 కీ.మీ రావడం4కీ.మీ పడుతుందన్నారు. ఎందరో రాజకీయ నాయకులు ఎన్నికలప్పుడు కనిపిస్తున్నారు. తదనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిలాని, రహమత్, యాసిన్, బుజ్జి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికం

విశాలాంధ్ర - యద్దనపూడి : టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి రాజమండ్రి జైలుకు తరలించి వేధించడం అప్రజాస్వామికమని చింతపల్లిపాడు గ్రామ టిడిపి నాయకులు అన్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు బాబుతో మేము కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా నిరాహార దీక్షలు తెదేపా కార్యాలయంలో కొనసాగించారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు, మహిళలు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జంపని అంకమ్మ, పొత్తూరి అశోక్ రంగారావు, అలపర్తి సాంబయ్య, పనకల్లు సాంబయ్య, జంపని వీర వసంతరావు, మురకొండ శేషగిరి, జంపని విజయ సారథి, రావల రాకేష్, కర్లపూడి నాగేశ్వరరావు, వజ్జ ఆదినారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు

- తవ్వకాలు అడ్డుకున్న సర్పంచ్ సుబ్రమణ్యం
- అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించలేదంటూ ఆరోపణలు

విశాలాంధ్ర - కర్లపాలెం : ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరగుతున్నాయని అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవటం లేదని సర్పంచ్ మాడా సుబ్రమణ్యం తెలిపారు. మండలంలోని నల్లమోతు వారిపాలెం గ్రామంలో అక్రమ ఇసుక తవ్వకాలు గత కొంతకాలంగా యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. మైనింగ్, రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా వైసీపీ నాయకులు ప్రభుత్వ భూముల్లో 20 అడుగులకు పైగా లోతు తవ్వి ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. వైసీపీ నాయకుల కను సన్నలలో అక్రమ తవ్వకాలు జరుగుతున్న అధికారులు ఏ మాత్రం పట్టించుకోవటం లేదన్నారు. కర్లపాలెం తహసీల్దార్, ఆర్.ఐ, ఎస్సై, నల్లమోతువారిపాలెం వీఆర్వో, సచివాలయ సిబ్బంది దృష్టికి సమస్యను తీసుకెళ్ళిన తమకేమి తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారని అధికారుల అండతో ఇసుక అక్రమార్కులు చెలరేగిపోతున్నారని సర్పంచ్ సుబ్రహ్మణ్యం మండిపడ్డారు. 5 నెలలుగా అక్రమ ఇసుకను తవ్వి తరలిస్తూ వ్యాపారం చేస్తున్నారని దీనిపై అధికారులకు స్వయంగా ఫిర్యాదు చేసిన పట్టించుకోవటంలేదన్నారు. ఇసుక తవ్వకం అక్రమమని చెప్పినప్పటికీ పట్టించుకోని అధికారులు రైతులు పొలాలలో మెరకల ఇసుక తీసుకెళుతుంటే పట్టుకోవటం చూస్తే అధికారుల చేతివాటం ప్రదర్శిస్తున్నారన్నారు. ఇసుక తవ్విన గుంతలలో పిల్లలు, పశువులు పడితే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఇసుక తవ్వకాలను నిలిపివేసి ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్న బీసాబత్తిన గోపిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సుబ్రమణ్యం కోరారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్దత కల్పించాలి

విశాలాంధ్ర - బాపట్ల : ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ బాపట కొత్త బస్టాండ్ సెంటర్‌లో ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో గురువారం రాస్తారోకో చేపట్టారు. ఎమ్మార్పీ ఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే షెడ్యూల్ కులాల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలన్నారు. తెలుగు రాష్ట్రాల నుండి ఏకైక కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి మాదిగల ఆవేదనను కేంద్రానికి వినిపించడంలో విఫలమవుతున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణకు బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో చట్టబద్ధత కల్పించకపోతే బిజెపి పార్టీని చరిత్ర క్షమించదన్నారు. చాలా ఏళ్ళ నుండి పెండింగ్‌లో ఉన్న మహిళా బిల్లుకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించినప్పుడు, ఎస్సీ వర్గీకరణ మద్దతు ఇచ్చిన బిజెపి బిల్లు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. మహిళా బిల్లుతో పాటు ఎస్సీ వర్గీకరణ బిల్లు కూడా పెట్టి మాదిగల పోరాటానికి న్యాయమైన ముగింపు ఇవ్వాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాష్ట్రంలోని కోటి మంది జనాభా కలిగిన మాదిగ, ఉప కులాల ప్రజలు బీజేపీని రాజకీయంగా భూస్థాపితం చేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య మాదిగ, పట్టణ కన్వీనర్ తాళ్లూరు రాజేష్ మాదిగ, మండలం కన్వీనర్ మల్లవరపు గాంధీ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ వందన మాదిగ, మాసిపోగు వేణు మాదిగ, తాళ్లూరు సురేష్ నాని, గద్దం చక్రవర్తి అబ్రహం, కిషోర్, బెజవాడ విజయ్, అమ్మి మున్నా, దుడ్డు రాంబాబు తేళ్ల మేరీషా, మున్నంగి డేవిడ్, సాయి, అనీలు, బన్ను వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో అపశృతి

- ఇద్దరు యువకుల దుర్మరణం
- నిమజ్జన ఏర్పాట్లు చేయని అధికారులు

విశాలాంధ్ర - రేపల్లె : వినాయక నిమజ్జనంలో అపశృతి జరిగింది. పోలీస్, రెవిన్యూ, ఫైర్ సిబ్బంది నిర్లక్ష్య వైఖరితో ఇద్దరు యువకులు నిండు ప్రాణాలు నీటి పాలైయ్యాయి. రేపల్లె మండలం పెనుమూడి వద్ద ఉన్న కృష్ణ నదిలో గురువారం తెల్లవారుజామున ఈ విషాద సంఘటన జరిగింది. సేకరించిన వివరాల మేరకు రేపల్లె పట్టణంలోని 24వ వార్డు నేతాజీ నగర్ కాలనీ వాసులు వినాయక చవితి సందర్భంగా విగ్రహం ఏర్పాటు చేశారు. మూడవ రోజు బుధవారం రాత్రి విగ్రహ నిమజ్జనం ఏర్పాట్లలో భాగంగా ఊరేగింపుతో బయలుదేరారు. ఊరేగింపు పెనుమూడి కృష్ణ నది ఒడ్డుకు చేరుకునే సరికి గురువారం తెల్లవారుజాము 3 గంటలు అయ్యింది. ఆ సమయంలో ట్రాక్టర్లో ఉన్న విగ్రహాన్ని నదిలో నిమజ్జనం చేస్తుండగా ప్రమాదవశాత్తు పడమటి విజయకుమార్ (20) కొండేటి వెంకటేశ్వర్లు(26) యువకులు విగ్రహంతో పాటు నదిలో పడిపోయారు. గమనించిన స్నేహితులు రక్షించే ప్రయత్నం చేసే లోపే నదిలో మునిగిపోయి మృతి చెందారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహను ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంభ సభ్యులకు అందజేశారు.

- నిమజ్జన ఏర్పాట్లలో అధికారుల నిర్లక్ష్యం

వినాయక విగ్రహాల ఏర్పాటు చేసే క్రమంలో అనుమతులు తప్పనిసరి చేసిన పోలీసులు నిమజ్జన సమయంలో ప్రజల రక్షణకై తీసుకోవలసిన జాగ్రత్తలుపై దృష్టి పెట్టక పోవటంతో ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. కృష్ణానది పరివాహ ప్రాంతంలో వినాయక విగ్రహాలు నిమజ్జనం చేస్తుండటం ఎప్పటి నుంచో ఆచారంగా ఉంది. అయితే అధికారులు సైతం కృష్ణానది నిమజ్జన ప్రాంతాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి పోలీస్ సిబ్బందిని కూడా నియమించటం పరిపాటిగా జరుగుతుండేది. ఈ క్రమంలో పోలీసులు, రెవిన్యూ, ఫైర్ అధికారులు కృష్ణ నదీ తీరాన భక్తుల నిమజ్జన సౌకర్యార్థం పటిష్టమైన చర్యలు తీసుకోలేదు. బారికేడ్లు, రోప్ తాడుల ఏర్పాటు, నది లోతును తెలియజేసే బోర్డులు, విద్యుత్ లైటింగ్, విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు నిపుణులతో కూడిన బృందం, క్రేన్ మొదలగు సదుపాయాలు ఏర్పాటు చెయ్యటంలో పోలీస్, రెవిన్యూ, విద్యుత్, ఫైర్ సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారు. ప్రస్తుత పోలీస్ అధికారులు వైసీపీ నాయకుల సేవలకు మాత్రమే పనిచేస్తున్నారు తప్ప, ప్రజా సేవలు చేయటం లేదనేది ప్రజలు బహిరంగంగా చర్చిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలు శాంతియుత దీక్షలు చేస్తున్నా స్థానిక వైసీపీ నాయకుని ఆదేశాల మేరకు పదుల సంఖ్యలో పోలీసులను మోహరిస్తూన్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- బాధిత కుటుంబాలను పరామర్శించిన టీడీపీ నాయకులు

వినాయక నిమజ్జనంలో అపశృతి జరిగి ఇద్దరు యువకులు మృతి చెందిన విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ శాసన సభ్యులు అనగాని సత్య ప్రసాద్ సోదరుడు శివ ప్రసాద్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రభుత్వ వైఫల్యమే కారణమని, బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు.

ప్రజాగ్రహంలో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయం

విశాలాంధ్ర-అద్దంకి : ప్రజాగ్రహంలో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయమని తెలుగుదేశంపార్టీ నేతలు అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో తెదేపా శ్రేణులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు గురువారానికి 9వ రోజుకు చేరాయి. ఈసందర్భముగా నేతలు మాట్లాడుతూ తెదేపా అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసి జైలులో ఇరికించి ముఖ్యమంత్రి జగన మోహనరెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నారని, ప్రజాగ్రహంలో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం దీక్షా శిభిరాన్ని బాపట్ల పార్లమెంట్ వైద్య విభాగం అధ్యక్షులు చదలవాడ ఫణీంద్రబాబు సందర్శించి సంఘీభావం తెలిపారు. దీక్షాపరులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

సాగర తీరంలో చంద్రబాబు సైకత శిల్పం

విశాలాంధ్ర - బాపట్ల : టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుని నిరసిస్తూ చంద్రబాబు నాయుడుకి సంఘీభావంగా బాపట్ల మండలంలోని పాండురంగాపురం సముద్రతీరంలో నియోజకవర్గ ఇంచార్జి వేగేశన నరేంద్రవర్మ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల విజయ్ అధ్వరంలో చంద్రబాబు నాయుడు సైకత శిల్పాన్ని ఏర్పాటు చేసి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - కర్లపాలెం : మండలంలోని నల్లమోతువారి పాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు ఇంటింటికీ వెళ్ళి కరపత్రాలు పంచుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అందించే వైద్య సదుపాయాలు వివరించి గ్రామంలోని ప్రజల ఆరోగ్యం పరిస్థితులు గురించి అడిగి తెలుసుకుంటున్నమన్నారు. ఆయన వెంట నల్లమోతు వారిపాలెం పంచాయతీ సెక్రటరీ పి.వెంకటేశ్వరరావు, ఎ.యన్.యం రత్నమాల, విలేజ్ హెల్త్ క్లినిక్ ఆఫీసర్ అనూష, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వి స్కాన్ సెంటర్‌లో 1.5 టెస్లా ఎంఆర్ఐ స్కాన్

విశాలాంధ్ర - చీరాల : పక్షవాత లక్షణాలు కనబడిన వెంటనే గుర్తించినట్లైతే 1.5 టెస్లా ఎంఆర్ఐ స్కానింగ్ చేయించి తక్షణమే వ్యాధి నిర్ధారణ చేయవచ్చునని డాక్టర్ పేట శ్రీకాంత్ అన్నారు. తద్వారా వచ్చు దీర్ఘకాలిక వ్యాధి సమస్యలను నివారించవచ్చునని తెలిపారు. చీరాల చర్చి కాంపౌండ్ ఆవరణలో ఉన్న పూర్వి స్కానింగ్ సెంటర్లో అధునాతన స్కానింగ్ మిషన్‌ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హైమా సుబ్బారావు, డాక్టర్.పేట శ్రీకాంత్‌లు మాట్లాడుతూ చీరాల పరిసరప్రాంతాల ప్రజలు ఇకపై అధునాతన స్కానింగ్ కోసం గుంటూరు, విజయవాడ వెళ్లే అవసరం లేకుండా చీరాలలోనే అత్యాధునిక 1.5 టెస్లా ఎంఆర్ఐ మిషన్‌ను అమర్చామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోరంట్ల సుబ్బారావు, డాక్టర్ అమృతపాణి, డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ ఉమా మోహన్, డాక్టర్ పి.వి.ప్రసాద్, డాక్టర్ హనుమాన్, చీరాల పరిసర ప్రాంతాలలోని ప్రముఖ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆధారాలు లేకుండా అరెస్టు అక్రమం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడును స్కిల్ డెవెలప్మెంట్ ప్రాజెక్టులో అవినీతి జరిగిందని, అక్రమాలు జరిగాయని, ఎటువంటి ఆధారాలు చూపకుండా వైకాపా ప్రభుత్వం అరెస్టు చేయడం అక్రమంమని చీరాల నియోజకవర్గ తెదేపా ఇంఛార్జి ఎం.ఎం కొండయ్య అన్నారు. అందుకు నిరసనగా కొండయ్య నాయకత్వంలో బైపాస్ రోడ్డులోని నూతన టిడిపి కార్యాలయంలో దేవాంగపురి గ్రామ టిడిపి మహిళా నాయకురాళ్లు 9వ రోజు దీక్షలో పాల్గొన్నారు. నల్ల కండువాలు ధరించి పెద్ద సంఖ్యలో నాయకులు దీక్షలో పాల్గొన్నారు. రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర్, పరిశీలకులు నాతాని ఉమామహేశ్వరరావు, షేక్ యాసిన్, ఐటీడీపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, జిల్లా మహిళా అధికార ప్రతినిధి రావిపాటి సంధ్య, గజవల్లి శ్రీనివాసరావు, సిద్ది బుచ్చేశ్వర రావు, పృథ్వి లలిత మోహన్, సత్య వేణి, హేమలత, విజయ, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - బాపట్ల : జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం కొల్లూరు మండలం జడ్.పి.హెచ్.ఎస్.బాలికల ఉన్నత పాఠశాల సమీపంలోని ఆలపాటి కృష్ణమూర్తి కమల కుమారి కళ్యాణ వేదికలో నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు మేలు చేయడం కొరకు ప్రజల వద్దకే జిల్లా యంత్రాంగమంతా వస్తుందన్నారు. ఈనెల 22వ తేదీన శుక్రవారం ఉదయం 10:30గం. క్షేత్రస్థాయిలో ప్రజా దర్బార్ జరుగుతుందన్నారు.

కిరణ్‌రాజ్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - బాపట్ల : దివ్యాంగుల సమస్యలను పరిష్కరించే విధంగా సిఎం జగన్ దృష్టికి తీసుకుని వెళ్ళి విశేషంగా కృషి చేస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర దివ్యాంగుల విభాగం అధ్యక్షులు బందెల కిరణ్ రాజ్ జన్మదినోత్సవాన్ని బాపట్లలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. వైసీపీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షులు చల్లా రామయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బధిరుల ఆశ్రమ పాఠశాల పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు.

జగన్‌కు రిటర్న్‌గిఫ్ట్ ఇచ్చేందుకు బీసీలు సిద్ధం

విశాలాంధ్ర - బాపట్ల : సీఎం జగన్‌కు బీసీలు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని టీడీపీ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. పార్టీ కార్యాలయంలో గురువారం నారా చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా బిసి సెల్ ఆధ్వర్యంలో బాబుకి తోడుగా ఒక నియంతపై పోరాటం మేము సైతం అంటూ బీసీ సెల్ నాయకులు నల్లకండువాలు వేసుకొని రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేగేశన మాట్లాడుతూ 50 శాతం ఉన్న బీసీలు తలచుకుంటే జగన్ ఇంటికి పోవటం ఖాయం అన్నారు. 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్‌ను 24 శాతంకు తగ్గించారని తెలిపారు. టీడీపీ హయాంలో చేతివృత్తుల పనివారికోసం ఆదరణ పథకం ద్వారా 120 కులాలకు ఆధునిక పరికరాలు ఇచ్చారన్నారు. చేనేతలకు ఉపాధి కల్పించి జగన్ వచ్చిన తర్వాత వాటన్నిటికీ మంగళం పాడారని విమర్శించారు.

సర్పంచ్‌ల సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర - బాపట్ల : సర్పంచ్‌ల సమస్యలు పరిష్కారం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిలకలపూడి పాపారావు అన్నారు. గురువారం బాపట్లలోని పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల జిల్లా కార్యాలయంలో జిల్లా సర్పంచ్‌ల సంక్షేమ సంఘం విస్తృత స్థాయి సమావేశం జరిగింది. అనంతరం జిల్లా సర్పంచులు సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా శౌంరి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా అక్కల శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సాధుబాబుకు జిల్లా జడ్జిగా పదోన్నతి

విశాలాంధ్ర - బాపట్ల : ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బి.సాధుబాబు జిల్లా జడ్జిగా పదోన్నతి పొందారు. ఈ నేపథ్యంలో స్థానిక సివిల్ జడ్జి కోర్టులో బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు భీమా లీలా కృష్ణ ఆధ్వర్యంలో సాధుబాబుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతపూర్ జిల్లాకి ఎనిమిదో అదనపు జిల్లా జడ్జిగా బదిలీపై వెళుతున్నట్లు తెలిపారు. భీమా లీలా కృష్ణ మాట్లాడుతూ సాదు బాబు విధి నిర్వహణను కొనియాడారు. జడ్జి సాధుబాబు మాట్లాడుతూ బాపట్ల బార్ అసోసియేషన్ సభ్యులు అందించిన సహకారాన్ని, మరువలేనని తెలిపారు.

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

పౌష్టికాహారంపై అవగాహనా ర్యాలీ

విశాలాంధ్ర - యద్దనపూడి : పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా మండలంలోని జాగర్లమూడి గ్రామంలో పౌష్టికాహారంపై సూపర్వైజర్ సుజాత ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని, తల్లిపాలు బిడ్డకు క్షేమమని, బిడ్డకు రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయన్నారు. ఎస్సీ కాలనీలోని ప్రధానోపాధ్యాయులు బెల్లం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆడపిల్లలకు రక్తహీనత లేకుండా ఉండేటట్లు తల్లులు పోషకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు, చిరుధాన్యాల వినియోగం వల్ల తల్లి బిడ్డల ఆరోగ్యం కాపాడుకోవడానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ అంగన్వాడి కార్యకర్తలు, ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, ఆయాలు, పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు హర్షణీయం

విశాలాంధ్ర - వేమూరు : మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర క్యాబినెట్‌లో ఆమోదం పొందటం హర్షణీయమని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సోమరౌతు అనురాధ పేర్కొన్నారు. గురువారం వేమూరులో విలేకరులతో మాట్లాడుతూ మహిళలు తమ హక్కుల కోసం ఎన్నో ఏళగా పోరాటాలు చేస్తున్నారని, అనేక సందర్భాల్లో వివిధ పార్టీలు మహిళా రిజర్వేషన్లు బిల్లుపై మాటలు వరకే చెప్పారుగానీ నేటి వరకు రూపు దాల్చలేదన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో కూడా పూర్తిగా ఆమోదం పొదుతుందని దీమ వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు వాసు, బ్రహ్మం, ఎలీషా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గురజాడ అడుగుజాడ

తెలుగు జాతికి వెలుగు జాడ

విశాలాంధ్ర - చీరాల : అభ్యుదయ భావ విప్లవానికి గురజాడ అడుగుజాడ తెలుగుజాతికి వెలుగు జాడ అని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోటా వెంకటేశ్వర రెడ్డి అన్నారు. జనవిజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం ఆధ్వరంలో గురువారం చీరాల విఠల్ నగర్‌లోని ఏఆర్ఎం హైస్కూల్లో గురజాడ 161 జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వీరాంజనేయులు మాట్లాడుతూ 1910లో గురజాడ రచించిన దేశభక్తి గీతం నేటి సమకాలీన సమాజానికి మహోన్నత సందేశం అన్నారు. గురజాడ రచించిన కన్యాశుల్కం నాటకం, బాల్య వివాహాలకు, వితంతు శిరోజాల దురాచారాలను ఖండించి తన సాహిత్యం ద్వారా ప్రజలను మేల్కొనే విధంగా రచనలు చేశారన్నారు. తొలుతగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైస్కూల్ ఉపాధ్యాయురాలు కే.సుధారాణి మాట్లాడుతూ ఆనాటి రోజుల్లో మహిళలపై జరుగుతున్న వేధింపులు దురాచారాలకు వ్యతిరేకంగా గురజాడ సాహిత్యం ద్వారా చేసిన పోరాటాన్ని ఆమె కొనియాడారు.

కూల్చివేతల ప్రభుత్వాన్ని కూల్చేస్తాం

విశాలాంధ్ర - రేపల్లె : కూల్చి వేతలతో పాలన ప్రారంభించిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో కూల్చి వేయాలని టీడీపీ ఎస్.సి సెల్ నాయకులు పిలుపునిచ్చారు. టిడిపి జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా పార్టీ శ్రేణులు చేపట్టిన సామూహిక నిరాహార దీక్షలు 7వ రోజుకు చేరాయి. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆదేశాల ఎస్సీ, ఎస్టీ,మైనార్టీలకు చెందిన టీడీపీ నేతలు దీక్షలో పాల్గొన్నారు. ఈ మేరకు స్వర్గీయ ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతలంతా నల్ల రిబ్బన్లు కట్టుకుని మేము సైతం బాబుతోనే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అరెస్టు అప్రజాస్వామికమన్నారు. రాష్ట్రంలో ఆటవిక పాలన నడుస్తోందని ఆరోపించారు. టీడీపీ పాలనలో దళితులకు 26 పథకాలు అమలుచేస్తే జగన్మోహన్ రెడ్డి ఆ పథకాలను రద్దు చేశారన్నారు. కార్యక్రమంలో అనగాని శివ ప్రసాద్, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, టీడీపీ లీగల్ సెల్ నాయకులు ధర్మతేజ, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే ప్రారంభం

విశాలాంధ్ర - నిజాంపట్నం : కూచినపూడి పీహెచ్సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ప్రారంభించినట్లు కూచినపూడి పీహెచ్సీ సూపర్వైజర్ మురళి తెలిపారు. గురువారం మండలంలోని దిండి, నర్రావారిపాలెం గ్రామాల్లో కూచినపూడి పీహెచ్సీ సూపర్వైజర్ మురళి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి సభ్యుల ఆరోగ్య వివరాలు సేకరించి వారికి అవసరమగు 7 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి టోకెన్లు అందజేశారు.

సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

విశాలాంధ్ర - నిజాంపట్నం : సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులుగా నిజాంపట్నం మండలం అడవులదీవి గ్రామ సర్పంచ్ శౌంరి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఈ మేరకు గురువారం బాపట్లలో నిర్వహించిన జిల్లాలోని సర్పంచులు సమావేశంలో సర్పంచులు అందరూ కలిసి శౌంరి శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు ఆశీస్సులతో తనకు అప్పజెప్పిన బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వర్తిస్తానని శ్రీనివాసరావు అన్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు పాపారావుకు, వీరాంజనేయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శౌంరి శ్రీనివాసరావును వైసీపీ నాయకులు మోపిదేవి హరనాథ్ బాబు, జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య, వైసీపీ నాయకులు కార్యకర్తలు, తదితరులు అభినందనలు తెలియజేశారు.